అయ్యో'పాప'ం

● మురుగు కాల్వలో పసికందు మృతదేహం లభ్యం



సంతో‌ష్‌నగర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): అమ్మ ప్రేమకు నోచుకోవాల్సిన శిశువు మురుగు కాలువలో విగతజీవిగా కనిపించడం స్థానికులను కలిచివేసింది. తల్లి ఆప్యాయత, అనురాగాలకు ఏ శిశువు కూడా దూరం కాకూడదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ హృదయవిదాయకర సంఘటన సంతోష్‌నగర్ కాలనీలో వెలుగుచూసింది. ఇన్‌స్పెక్టర్ కోల సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. సంతోష్‌నగర్.. అరుంధతికాలనీ మురుగుకాలువలో నెల వయసు ఉన్న ఓ ఆడశిశువు కనిపించింది. పసికందును చూసిన ఓ వ్యక్తి మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి సిబ్బందితో కలిసి ఇన్‌స్పెక్టర్ చేరుకొని పరిశీలించారు. కాలువలో తేలుతున్న పసికందు మృతదేహాన్ని వెలికి తీయించి ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పాప మృతదేహాన్ని తెచ్చి నాలాలో పడేశారా? వేరే కారణాలు ఏవైనా ఉన్నాయా? అనే కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆపై కాలువ పరివాహ ప్రాంతంలోని సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.



సౌభాగ్యనగర్ కాలనీలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్

త్వరలో శాశ్వత పరిష్కారం : మధుయాష్కీ గౌడ్

వనస్థలిపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): 118 జీవో బాధిత కాలనీవాసుల సమస్యకు రాబోయే మూడు నెలల్లో శాశ్వత పరిష్కారం లభించనుందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని సౌభాగ్యనగర్, బృందావన్ మీడోస్, ఏపీఆర్ క్రిస్టల్ విల్లాస్, జక్కిడి రామస్వామి కాలనీ, శ్రీనివాస కాలనీల్లో మంగళవారం ఆయన పర్యటించి కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి ఎంపీగా ఉన్నప్పుడు మంజూరు చేసిన నిధులతో సౌభాగ్యనగర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. అనంతరం పలు కాలనీ సంక్షేమ సంఘాల అధ్యక్షులు మాట్లాడుతూ తమ కాలనీలకు డ్రైనేజీ ట్రంక్‌లైన్, రోడ్ల నిర్మాణాలు, వరదనీటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ముందు నియోజకవర్గంలో అన్ని సమస్యలు పరిష్కరించానని ఎమ్మెల్యే ఓట్లు వేయించుకున్నాడన్నారు. కానీ కాలనీల్లో రోడ్డు, డ్రైనేజీ తదితర సమస్యలు ఎక్కడికక్కడే ఉన్నాయన్నారు. తమ ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎల్బీనగర్ నియోజకవర్గంలో రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. కార్పొరేటర్లు రాగుల వెంకటేశ్వర్ రెడ్డి, సుజాత నాయక్, మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న, సౌభాగ్యనగర్ కాలనీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందకిషోర్, శశికాంత్, విద్యారెడ్డి పాల్గొన్నారు.

ఏబీవీపీ కార్యకర్తల ధర్నా

చాదర్‌ఘాట్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ దిల్‌సుఖ్‌నగర్ చౌరస్తాలో ఏబీవీపీ కార్యకర్తలు మంగళవారం అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ధర్నా చేశారు. ఈసందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అలివేలి రాజు మాట్లాడుతూ స్కాలర్‌షిప్ ప్రభుత్వం విద్యార్థులకు వేసే భిక్ష కాదు. విద్యార్థుల హక్కు అని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై నిర్లక్ష్యధోరణిని అవలంబిస్తే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు ఆక్వారీ మహేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా ఇప్పటికే ఫీజు రీయిబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం సరికాదన్నారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ గంగాధర్, కార్యదర్శి విశ్వతేజ, నాయకులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో 'యంగ్ ఎర్త్ లీడర్స్'

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తారామతిపేట.. పీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో యంగ్ ఎర్త్ లీడర్స్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి నాబార్డ్ సంస్థ రంగారెడ్డి జిల్లా డీడీఎం హరీష్‌రఘురాం, సీజీఆర్ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ జేఎస్ఆర్ అన్నమయ్య, ఔషధ తోట సలహాదారులు మహమ్మద్ రఫీయుద్దీన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలోని ఔషధ మొక్కలు, కూరగాయల తోట, ఇంకుడు గుంత, కంపోస్టు పిట్‌ను పరిశీలించారు.

'ఎప్పుడైనా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తాం'

చాదర్‌ఘాట్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): నగర ట్రాఫిక్ పోలీసులు వాహనాదారులను ఏ సమయంలోనైనా ఎక్కడైనా డ్రంకెన్ డ్రైవ్‌లు నిర్వహిస్తారని నగర ట్రాఫిక్ డీసీపీ-3 ఆర్.వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులతో కలిసి ఆయన మలక్‌పేటలో ప్రైవేటు బస్సులను తనిఖీ చేశారు. నో ఎంట్రీ సమయంలో నగరంలో సంచరిస్తున్న రెండు ప్రైవేటు బస్సుకు జరిమానాలు విధించాలని ఆదేశించారు. నగర ట్రాఫిక్ నిబంధనల ప్రకారం ఉదయం 8 గంటల తర్వాత రాత్రి 10 గంటల్లోపు ప్రైవేటు బస్సులు నగరంలోకి ప్రవేశించరాదన్న నిబంధనలను అతిక్రమిస్తే మొదట్లో జరిమానాలు విధిస్తామని తెలిపారు. ఆ తర్వాత సీజ్ చేస్తామని హెచ్చరించారు. 2025 జనవరి నుంచి ఇప్పటి వరకు మలక్‌పేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 1,950 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయన్నారు. ఇప్పటివరకు ఈనెలలో 345 కేసులు నమోదయ్యాయని వివరించారు.

ఇయ్యర్ ఫోన్లతో డ్రైవింగ్ చేస్తే జరిమానాలు

వాహనాలను నడిపే సమయంలో ఇయ్యర్‌ఫోన్‌లు పెట్టుకొని మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, ఒకవేళ చేస్తే జరిమానాలు విధిస్తామని డీసీపీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. సౌత్ ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రకుమార్, మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ టి.అశోక్‌కుమార్‌తోపాటు పలువురు సిబ్బంది.. డీసీపీ వెంట తనిఖీలు నిర్వహించారు.

ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గుర్తు పెట్టుకోవాలి

కొత్తపేట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ సిగ్నల్స్‌ను చిన్నారులు గుర్తు పెట్టుకోవాలని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఏఎస్ఐ సోమ్‌నాథ్ అన్నారు. మంగళవారం ఎల్బీనగర్ రాక్‌టౌన్ కంగారు కిడ్స్ స్కూల్ నుంచి 43 మంది బడిపిల్లలు రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. తొలుత విద్యార్థులకు పార్కు గోడలపై గల రంగురంగుల సైన్ బోర్డులపై ఉన్న ట్రాఫిక్ నిబంధనల సూచనలు, రోడ్ సైన్స్ చూపుతూ టీటీఐ నిబంధనల ప్రాముఖ్యతను వివరించారు. పార్కులో ఏర్పాటు చేసిన నమూనా సిగ్నల్ వ్యవస్థనూ పిల్లలకు చూపించారు. మద్యంమత్తులో వాహనాలు నడపడం ప్రాణాంతక నష్టాల పాలవడమేనని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ రాచపుడి తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన వారిలో 45 మందికి కుటుంబ సభ్యుల సమక్షంలో నాలుగు విడతలుగా కౌన్సెలింగ్ నిర్వహించారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా తుమ్మేటి శ్రీను

వనస్థలిపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా తుమ్మేటి శ్రీను నియామకం అయ్యారు. మంగళవారం తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో బీసీ కులస్తుల హక్కుల సాధనకు తన వంతుగా కృషి చేస్తానన్నారు. తన నియామకానికి కృషి రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్, తెలంగాణ ఉద్యమకారులు నిమ్మల గిరీష్ గౌడ్ తదితరులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఐక్యతకు ప్రతీక ఛట్ పూజ

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఉత్తర భారత ప్రజల ఐక్యతకు ప్రతీకగా ఛట్‌పూజ నిలుస్తోందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ నాగోల్ చెరువు కొలను వద్ద బిహార్ అసోసియేషన్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ఛట్‌పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ చింతల అరుణా సురేంద్రనాథ్‌యాదవ్‌లు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉత్తర భారతీయులు ఉపవాస దీక్షలతో సూర్యోదయాన నదులు, చెరువులు, కుంటలు, కొలనుల వద్ద సూర్యభగవానుడిని ఆరాధించి పండ్లు నైవేద్యాలుగా పెట్టడం గొప్ప సంప్రదాయమని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు.

మర్వాడీల గొప్ప పండగ..

సూర్యభగవానుడికి కొలిచే మర్వాడీల గొప్ప పండగ ఛట్‌పూజ అని, ఇది ఓ పవిత్ర సంస్కృతికి నిదర్శనమని నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్ యాదవ్ కొనియాడారు. ఈ ప్రాంతంలో ఉత్తర్‌ప్రదేశ్, బిహారీలతో పాటు పలు రాష్ట్రాలకు చెందిన మార్వాడీలు నివాసముంటున్నారని, యేటా వారి సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ పూజ నిర్వహిస్తున్నామన్నారు. జీహెచ్‌ఎంసీ హయత్‌నగర్ డిప్యూటీ కమిషనర్ వంశీకృష్ణ, డీఈ నీలిమ, జవాను దర్శన్, బీహార్ అసోసియేషన్ అధ్యక్షుడు అమ్రేష్‌కుమార్ మౌర్య, రాము, అమర్‌నాథ్ మౌర్య, దినేష్, బబ్లూగుప్తా, మోహిత్, మంటూ కేసరి, అభిషేక్ మౌర్య, ఇతర ప్రతినిధులు వేడుకల్లో పాల్గొన్నారు.

సూర్యభగవానుడి ఆశీస్సులు ఉండాలి

సూర్యభగవానుడిని కొలిచే పండగ ఛట్ పూజ అని, ఆ భగవానుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మన్సూరాబాద్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. మన్సూరాబాద్ పెద్ద చెరువు కొలను వద్ద మానవ కళ్యాణ్ సేవా సంఘ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ఛట్‌పూజ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన విచ్చేసి పూజలు చేశారు. కార్యక్రమంలో సంఘ్ సభ్యులు మనోహర్‌సింగ్, ఓపీ సింగ్, రాజ్‌కుమార్ పాండే, రాజీవ్‌శర్మ, నందకిశోర్‌మిశ్రా, విజయ్‌గౌడ్, రమన్‌భాయ్, రమన్‌శర్మ, కమల్‌శర్మ, బూరెల్ల భాస్కర్ తదితరులు ఉన్నారు.



కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానంలో నిర్వహిస్తున్న ఛట్‌పూజలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎమ్మెల్యే పూజలు

చంపాపేట: ఉత్తర్ భారతి నాగరిక్ సంఘ్ ప్రజలు చేస్తున్న ఛట్ పూజలతో సూర్య భగవాన్ ఆశీస్సులు వారి కుటుంబాలపై సంపూర్ణంగా ఎల్లవేళలా ఉంటాయని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానం కోనేరులో రెండు రోజుల నుంచి ఉత్తర్ భారతి నాగరిక్ సంఘ్ హైదరాబాద్ చైర్మన్ ఎన్‌కే సింగ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఛట్ పూజలలో మంగళవారం ఉదయం ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేశారు. ఆలయ మాజీ ధర్మకర్త మధుసాగర్, సాగరిక్ సంఘ్ సభ్యులు అమర్‌దీప్‌సింగ్, నందకిషోర్‌సింగ్, ఆదిత్యసింగ్ పాల్గొన్నారు.

పోలీస్ అమరుల త్యాగాలు మరువలేం

● వనస్థలిపురం ఏసీపీ పల్లె కాశీరెడ్డి



అబ్దుల్లాపూర్‌మెట్: మాట్లాడుతున్న డీసీపీ అనురాధ

వనస్థలిపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరుల త్యాగాలు మరువలేనివని వనస్థలిపురం ఏసీపీ పల్లె కాశీరెడ్డి అన్నారు. మంగళవారం వనస్థలిపురంలో ఇన్‌స్పెక్టర్ టి.మహేష్ ఆధ్వర్యంలో పోలీసు అమరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ మాట్లాడుతూ ప్రజల భద్రతే ధ్యేయంగా విధులు నిర్వహిస్తున్న పోలీసులు తమ ప్రాణాలు కోల్పోవడం వారి కుటుంబాలకు తీరని లోటని అన్నారు. వారి ఆశయసాధనకు తమ వంతుగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్, మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ శంకర్, ఎస్సైలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


సీసీ కెమెరాలు తప్పనిసరి: డీసీపీ అనురాధ

అబ్దుల్లాపూర్‌మెట్: గేటెడ్ కమ్యూనిటీ, కొత్తగా వెలుస్తున్న కాలనీల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎల్బీనగర్ డీసీపీ అనురాధ సూచించారు. పోలీసు అమరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ లక్ష్మారెడ్డి పాలెం మైత్రీకుటీర్ గేటెడ్ కమ్యూనిటీలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీసు అమరులకు నివాళులర్పించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు అహర్నిశలు కృషి చేస్తారన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి కాలనీ అసోసియేషన్ వారు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో వాహనాల రాకపోకల మార్కింగ్ సరిగా లేకపోవడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని కాలనీ గౌరవ అధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ మల్లికార్జున్‌రావు తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా మార్కింగ్ చేయించాలన్నారు.

భారీ ర్యాలీ

దిల్‌సుఖ్‌నగర్ : పోలీస్ అమరులను స్మరిస్తూ చైతన్యపురి పోలీసులు, ఓమ్ని ఆసుపత్రి సిబ్బంది మంగళవారం చైతన్యపురి పీఎస్ నుంచి ఓమ్ని చౌరస్తా, మోడల్ డైరీ చౌరస్తా మీదుగా కొత్తపేట చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అమరుల త్యాగాలను ఇన్‌స్పెక్టర్ సైదులు కొనియాడారు.

కొత్తపేట: ఎల్బీనగర్ రింగ్‌రోడ్డులో రాచకొండ కమిషనరేట్ పోలీస్ బ్యాండ్ బృందం దేశభక్తి గీతాలతో అమరులకు నివాళులు అర్పించింది.



రెహమత్‌నగర్‌లో ఎన్నికల ప్రచారంలో ఏఎంసీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి తదితరులు

కాంగ్రెస్ విస్తృత ప్రచారం

హయత్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను గెలిపించాలని కోరుతూ మంగళవారం యాదగిరినగర్‌లో తాండూరు ఎమ్మెల్యే బి. మనోహర్‌రెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య ప్రచారం నిర్వహించారు. యువకుడైన నవీన్‌యాదవ్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కాంగ్రెస్ నాయకుడు మనోజ్‌తో పాటు తాండూరుకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

రెహమత్‌నగర్‌లో

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌కు మద్దతుగా నియోజకవర్గంలోని రెహమత్‌నగర్ డివిజన్‌లో కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికి తిరుగుతూ సీఎం సారథ్యంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

చంపాపేట, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరుగుతున్న ఉపఎన్నికలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని టీపీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ విజయం సాధిస్తారని అన్నారు. నియోజకవర్గంలో ఆయా డివిజన్లకు కాంగ్రెస్ సేవాదళ్ ఇన్‌చార్జీలను నియమించినట్లు తెలిపారు. యూసుఫ్‌గూడ డివిజన్ ఇన్‌చార్జీగా మహ్మద్ వాజిద్ షైక్, కో-ఇన్‌చార్జిగా రామలీల, రహమత్‌నగర్ ఇన్‌చార్జిగా ఎండీ వాజిద్ పాషా, కో-ఇన్‌చార్జిగా సునిత, సోమాజిగూడ ఇన్‌చార్జిగా పిట్ల బాల్‌రాజ్, కో-ఇన్‌చార్జిగా శకుంతలరెడ్డి, షేక్‌పేట ఇన్‌చార్జిగా వెంకట సురేష్ కరుణం, వెంగళరావునగర్ ఇన్‌చార్జిగా సాండ్వాకర్ ప్రకాష్, బోరబండ ఇన్‌చార్జిగా అబూబాకర్ సిద్ధిఖీ, ఎర్రగడ్డ ఇన్‌చార్జిగా మహ్మద్ ఇష్తాకార్ అలీ, జూబ్లీహిల్స్ నియోజకవర్గం కో-ఆర్డినేటర్‌గా బండి సురేందర్, దయ్యం శేఖర్‌లను నియమించినట్లు మిద్దెల జితేందర్ పేర్కొన్నారు.

'అవినీతికి పాల్పడటం నేరం'

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): అవినీతికి పాల్పడడం నేరమని దాన్ని సమాజం నుంచి పారదోలాలని కేంద్రీయ భూగర్భ జలబోర్డు ప్రాంతీయ సంచాలకులు (రీజినల్ డైరెక్టర్) ఎన్.జ్యోతికుమార్ సూచించారు. అప్రమత్తత అవగాహన వారోత్సవాల్లో భాగంగా జలశక్తి మంత్రిత్వ శాఖ, కేంద్ర భూగర్భ జలశాఖ, బండ్లగూడలోని సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ తట్టిఅన్నారంలోని వార్డు కార్యాలయంలో విజిలెన్స్ అవగాహన సదస్సు నిర్వహించారు.